




నెలనెలా ఒక జ్ఞాపకం    డాక్టర్ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి

# నండూరి మామయ్యగారు.

'ఎంకిపాటల' నండూరి సుబ్బారావుగారి కుటుంబానికీ మా కుటుంబానికీ చెప్పలేనంత సన్నిహితమైత్రి. అది బంధుత్వం కన్నా బరువైనది, బిగువైనది.

నా మేనమామ "పద్మభూషణ" దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితో పాటు, ఆప్తులైన నవ కవిశేఖరులెందరో, విదుషీమణి అయిన మా అమ్మ వింజమూరి వెంకటరత్నమ్మగారికి సోదరులూ, మా నాన్నగారు "పద్మశ్రీ" వింజమూరి నరసింహారావుగారికి బావమరదులు. అందువల్ల మాకు మేనమామలుగా అయిపోయారు. ఈ కవులందరిలో, నండూరివారు మరీ సన్నిహితులయారు.

సుబ్బారావుగారు, నా మేనమామ కృష్ణశాస్త్రి క్లాస్ మేట్సే కాక, సాహిత్యరంగంలో దాదాపు ఒకే సమయంలో ప్రవేశించిన వారు కూడ, కర్నూలు జిల్లా కారడవుల్లో ప్రయాణం చేస్తుండగా 'ఇన్స్పయిర్' అయి "ఆకులో ఆకునై పూవులో పూవునై, ఈ అడవి దాగిపోనా, ఎటులైన ఇచటనే ఆగిపోనా?" - అన్న పాటతో కృష్ణశాస్త్రి 'కృష్ణ పక్ష' రచన మొదలు పెడితే, మద్రాసు బీచ్ సౌందర్యానికి ముగ్ధులైన నండూరి వారు, సముద్రపు ఒడ్డు ఇసుక తిన్నెలలో కూర్చుని "గుండె గొంతులోన కొట్లాడుతాది" - అన్న పాటతో ఎంకి పాటల రచన మొదలు పెట్టారు. ఏ ముహూర్తాన్ని వీరిద్దరూ తమ రచనా సౌధాలకు శంఖు స్థాపన చేశారో కాని, వీరిద్దరూ గేయరచనలో అద్వితీయులైనారు.

నవ్య కవితా వాతావరణంలో పుట్టి పెరిగిన నేను, నా తొమ్మిదవ ఏటనుంచీ మ్యూజిక్ కంపోజరుగా, గాయనిగా, కళారంగంలో ప్రవేశించటం తటస్థించింది. ఆనాటి నుంచీ, ప్రసిద్ధ నవకవుల గేయాలెన్నిటికో నేను, శాస్త్ర సమ్మతమైన లలిత సంగీతాన్ని పొదగటం, అలాంటి నా సొంత 'ట్యూన్స్'నే, నా లలిత జానపద సంగీత కచేరీలలో పాడుతూండటం, రివాజైపోయింది. నా కచేరీలలో ఎక్కువ భాగం నా మేనమామ కృష్ణశాస్త్రి గేయాలు, తరువాత సుబ్బారావు మామయ్యగారి ఎంకి పాటలూ పాడటం నాకు అలనాటి అలవాటు. ఇలాగ, ఇద్దరు అద్వితీయ గేయ రచయితల ముద్దుల మేనగోడల్ని అయే భాగ్యం నాకు కలగడం ఎంతో గర్వకారణం.

మా కుటుంబం, నండూరి వారి కుటుంబం, ఒకే కళాసాగరంలో కలసే సాహితీ ఝురుల్లాగ కలిసి మెలిసి ఉండేవాళ్ళం. మేము కాకినాడలో ఉండబట్టి, సుబ్బారావు మామయ్యగారు వారి పిల్లలందరినీ కాకినాడ కాలేజీలో చదివిస్తూ, ఆ వంకని తరుచు ఏలూరు నుంచి వస్తూ మాతో కాలం గడిపేవారు. ఆయన వచ్చారంటే మా ఇంట్లో కవితా గోష్ఠి ఏర్పాటు చేయవలసిందే అందులో అయన పాడటం, నాచేత పాడించటం జరిగేది. అలాగే, ప్రతీవేసంగి సెలవులకీ, మా కుటుంబం ఏలూరు వెళ్ళి, ఆ రెండు నెలలూ నిత్య సంగీత సాహిత్య గోష్ఠులతో, పాటలతో, ఆనందంగా గడిపేవాళ్ళం. సుబ్బారావుగారు జీవించి ఉన్నంత కాలం, అలాగే సాగింది.

చిత్రమేమిటంటే, సుబ్బారావుగారిని మామయ్యగారనీ, ఆయన భార్యని అత్తయ్యగారని పిలుస్తూ, కొడుకుల్ని, రాజన్నయ్య, సేతన్నయ్య, బాలన్నయ్య అని పిలిచేవాళ్ళం, నాలుగో కొడుకు సారథీ, నేనూ ఒకే వయస్సు వాళ్ళం. ఒకే కూతురు రమణమ్మ. వీళ్ళల్లో బాలన్నయ్య, రమణమ్మ కొంచెం పాడే వారు. నేను హార్మోనియమ్ వాయిస్తూంటే, అందరూ నాతో కలసి సినీమా పాటలు (కె. ఎల్. సైగల్, పంకజ్‌మల్లిక్ మొదలగు వారి అప్పటి పాపులర్ సాంగ్స్) ఎంకి పాటలూ పాడేవారు. పెద్ద వాళ్ళంతా వింటూ ఆనందిస్తూండేవారు.

నండూరివారి గేయరచనలో ఒక ప్రత్యేకత - చాలామంది గేయ రచనల్లో లేనిది - ఉంది. సుబ్బారావుగారు సంగీత సాహిత్యాల్లో సమాన ప్రజ్ఞ గల వాగ్గేయకారుడు. ఆనాడు త్యాగరాజుకి లాగ, ఈనాడు కృష్ణశాస్త్రికిలాగ, నండూరి వారికి కూడా, పాటకు పల్లవి ప్రాణం. వీలైనంత వరకు యతులు, ప్రాసలు, అంత్య ప్రాసలు, పదశిల్పనాచాతుర్యం, మొదలైన రక్తులు చాలా అవసరమనీ, బాగా తెలుసును. పైగా సుబ్బారావుగారు సంగీతపు రక్తులెరిగిన గాయకుడు కూడాను. అందువల్లే ఆయనకు సాహిత్యం సంగీతం - మాటా పాటా - ఏకకాలంలో పెనవేసుకుని పుట్టుకుని వచ్చేవి. కాబట్టే, ఆయన గేయాల్లో వ్యర్థపదాలు, 'ట్యూన్స్'లో రక్తి విహీనమైన సంగతులూ ఉండేవి కావు. అందువల్లనే, గాయకులు ఎంకి పాటలు పాడాలంటే, నండూరి వారి 'ఒరిజినల్ ట్యూన్స్' లోనే తప్ప, మరెలా మార్చి పాడినా, ఎంకి పాటలకూ, రచయితకూ ద్రోహం చేసిన వారవుతారు. ఇటీవల కొందరు ఆ పాటల్ని 'ట్యూన్స్' మార్చి పాడించారు. కాని అవి 'శంకరాభరణం' సినిమాలో 'బ్రోచేవారెవరురా'మార్చి పాడినట్టనిపించింది.

నా అదృష్టం వల్ల, అన్ని ఎంకి పాటలూ - ముద్రితాలు, అముద్రితాలూ కూడా - సుబ్బారావు మామయ్యగారి వద్దనే, ఆయన ట్యూన్స్‌లోనే నేర్చుకుని, పాడే భాగ్యం నాకు కలిగింది. నాకే కలిగింది.

సుబ్బారావుగారు చాలా జబ్బుగా ఉన్నప్పుడు, పోయే ముందు, వైద్యానికి మద్రాసుకు వచ్చారు. ట్రిప్లికేన్‌లో బస చేశారు. ఆ పరిస్థితిలో కూడా, నన్ను పిలిపించి, కొత్త ఎంకి పాటలు వ్రాశాననీ, అవి ఇంకా ప్రింట్ కూడా అవలేదనీ చెపుతూ, ఎక్కడలేని ఓపిక తెచ్చుకుని, ఆ పాటలు నాకు నేర్పించారు. తరువాత, కొన్నాళ్ళకే ఆయన పోయారు. ఆ పాటలన్నీ ప్రింట్ అయాయో లేదో తెలియదుకాని, నేను ఆ పాటలకి

వారసురాలనయాను. అప్పటి ఆ ఎంకి పాటలు, ఇంకా భావయుక్తంగా ఉన్నాయి. అయితే, రస్టిక్ టింజ్ కొంచెం తగ్గి, లిరికల్‌థాట్ ఎక్కువగా ఉన్నట్టనిపించింది.

అనేకమైన నా సంగీత కచేరీల్లోనూ, లెక్కలేనన్ని రేడియో ప్రోగ్రాముల్లోనూ, గ్రామ్ ఫోన్ రికార్డుల్లోనూ ఎంకి పాటలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉన్నాను.

నండూరి సుబ్బారావు మామయ్యగారు అమరులు! ఎంకి పాటల్లో ఆయనెప్పుడూ జీవించే ఉంటారు.





జనవరి 2006 - మీ సుజనరంజని 25 వ సంచిక..!!ఈ సంచికనుంచీ ఆకర్షణీయమైన శీర్షికలు మరిన్ని ఆరంభమౌతున్నాయి..కొన్నింటిలో మీరూ పాల్గొనండి..వివరాలకోసం ఇక్కడ క్లిక్ చేయండి